‘పాలమూరు’తో సస్యశ్యామలం


జడ్చర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌తో జిల్లా సస్యశ్యామలం అవ్వబోతోందని ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి తెలిపారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం నిర్వహించిన సాగునీటి దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా సాధించుకున్న తెలంగాణాలో సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత కల్పించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసుకున్నామన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మిడ్జిల్ మండలంలో దాదాపు 8 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను చేపట్టారని తెలిపారు. విపక్ష నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. దాదాపు 70 టీఎంసీలను జూరాల నుంచి తరలించే పరిస్థితి లేదన్నారు. ఆగస్టులో కర్వెన రిజర్వాయర్ వరకు నీటిని తీసుకువస్తామన్నారు. తరువాతి దశలో ఉదండాపూర్ రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తామని తెలిపారు. మిషన్ కాకతీయ పథకం కింద చెరువులు, కుంటలను అభివృద్ధి చేసుకున్నామని, చెరువులలో ఒండ్రు మట్టిని పొలాలకు తరలించడం వల్ల పంట భూములు సారవంతం కావడంతో పాటు చెరువులలో నీటి నిల్వ సామర్థ్యం పెరిగిందన్నారు. అదేవిధంగా భూగర్భజలాలు పెరిగాయని వివరించారు. కర్వెన నుంచి ఉదండాపూర్ వరకు దాదాపు 9 కి.మీల పొడవున టన్నెల్(సొరంగం) నిర్మాణం చేశారని స్థానిక ప్రజలు సందర్శించి పనులను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. పాలమూరు ప్రాజెక్ట్ ఆలస్యం కావడానికి ప్రతిపక్ష పార్టీలే కారణమని ఆరోపించారు. అడుగడుగున పనులకు అడ్డు తగిలారని ,రైతులను రెచ్చగొట్టారని ఫలితంగా పనులలో కొంత ఆలస్యం చోటు చేసుకుందన్నారు. ప్రతిగ్రామంలో చెరువుల పండుగ గురువారం నిర్వహిస్తున్నామని రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎస్ఈ శ్రీనివాస్ ఉదండాపూర్ పనులను డిసెంబర్ లోగా పూర్తి చేస్తామని తెలిపారు. తద్వారా నియోజకవర్గంలో 1.91లక్షల ఎకరాలకు సాగు నీరు అందే అవకాశం ఉందన్నారు. ఉదండాపూర్ నుంచి దిగువకు నిర్మించే కాలువలకు రూ.5620 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, త్వరలోనే ఆయా పనులకు టెండర్లు పిలుస్తామని వివరించారు. అంతకుముందు తెలంగాణాలో చేపట్టిన ప్రాజెక్ట్‌లకు సంబంధించిన పుస్తకాలను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, మార్కెట్ చైర్మన్ గోవర్దన్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సుదర్శన్‌గౌడ్, ఈఈ ఉదయ్‌శంకర్, డీఈ మధు తదితరులు ఉన్నారు.

చిన్నచింతకుంట: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం సస్యశ్యామలం అయిందని ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలో బుధవారం నిర్వహించిన సాగునీటి దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాగునీటి రంగంలో సాధించిన ప్రగతి బుక్‌ను ఆవిష్కరించారు. రైతు సంతోషంగా ఉంటే దేశం సంతోషంగా ఉంటుందని భావించిన కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. వలసలు నివారించేందుకే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారన్నారు. బీజేపీ నాయకులు వేసిన కేసుల వల్లే పనులు ఆలస్యంగా కొనసాగాయన్నారు. కేసీఆర్ ముందుచూపుతో కర్వెన ప్రాజెక్ట్ నుంచి నారాయణపేటకు నీటిని తరలించే కాల్వ ద్వారా కోయిల్ సాగర్ ప్రాజెక్ట్‌కు లింకును కలిపి ఊక చెట్టువాగు ద్వారా జూరాల ఆయకట్టు కింద రెండో పంటకు నీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాడని తెలిపారు. ఇప్పటికే నియోజక వర్గానికి అధిక చెక్‌డ్యాంలు మంజూరు చేశారన్నారు. 22 పూర్తి కాగా మరో 9 మంజూరయ్యాయన్నారు. దీంతో నియోజకవర్గంలో 1.40 లక్షల ఎకరాలు అధికంగా సాగు అయ్యిందన్నారు. ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి, ఇరిగేషన్ ఈఈ ప్రతాప్‌సింగ్, డిప్యూటీ డీఈలు చందు నాయక్, గోపాలచారి, తహసీల్దార్ సువర్ణరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చిన్నచింతకుంటలో సాగునీటిలో సాధించిన ప్రగతిబుక్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు శ్రీరామరక్ష అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఉద్యమం



మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టబద్ధత కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్‌మాదిగ పిలుపునిచ్చారు. ఈనెల 12న జిల్లా కేంద్రంలో జరిగే సమావేశ కరపత్రాలను బుధవారం అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ అగ్రవర్ణాల ఆధిపత్యం వల్లే ఎస్సీ వర్గీకరణ జరగడం లేదని అన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అనుకూలమని ప్రకటనలు చేస్తుండగా బిల్లు మాత్రం పెట్టకుండా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాదిగలు నిర్మాణాత్మకంగా ఎదగాలని అన్నారు. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని, ఉమ్మడి జిల్లా పరిధిలోని నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్య, నాయకులు కావలి కృష్ణయ్య, నరసింహా, కొండన్న, బోయపల్లి ఆంజనేయులు, శేఖర్, నరేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

బాలానగర్: మండలపరిధిలోని మోతీఘణాపూర్ రెవెన్యూ గ్రామం మేడిగడ్డ తండాలో బుధవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు వారిని సన్మానించారు. తమ గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ ఇలాగే సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాజాపూర్ : దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శివసీతారామాంజనేయస్వామి దేవాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వేడుకల్లో బుధవారం పాల్గొని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డితోపాటు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. యాదగిరి గుట్టను అపురూపంగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే, ఎంపీలను శాలువాలతో సత్కరించారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పెరిబచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నవాబుపేట: కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో చేస్తున్న పాలన వల్ల రాష్ట్రంలో ప్రతి పల్లెలో పండగల వాతావరణం ఏర్పడిందని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. చౌడూర్‌లో బుధవారం బొడ్రాయి, గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, రైతు బంధు మండల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, ప్రతాప్, యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సర్పంచ్ మృతి

దేవరకద్ర రూరల్: కొౌకుంట్ల మండలం వెంకంపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ మురళీధర్ రెడ్డి (75) గుండెపోటుతో మృతి చెందారు. బీచుపల్లిలో గురువారం నిర్వహించనున్న బంధువుల శుభకార్యంలో పాల్గొనేందుకోసం బుధవారం మహబూబ్‌నగర్ నుంచి కారులో స్వగ్రామానికి వచ్చారు. కారును ఇంటి దగ్గర పార్కు చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యారు. ఈ క్రమంలోనే కారు అదుపుతప్పి పక్కనే ఉన్న చిన్నగుంత వద్దకు వెళ్లింది. విషయాన్ని గమనించిన స్థానికులు ఆయనను హుటాహుటిన సమీపంలోనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకోసం మరో ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలోనే ఆయన కన్నుమూశారు. ఆయన మృతి పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు. గ్రామ సమీపంలో రూ. 51 కోట్లతో ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న పేరూర్ ఎత్తిపోతల పథకం మంజూరు కోసం దాదాపు 4 ఏళ్ల పోరాటం చేశారని, పనులు ప్రస్తుతం కొనసాగుతుండగానే సర్పంచ్ మృతి చెందడం విచారకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

పాలమూరులో కబ్జాలు పెరిగాయి



పాలమూరు: నియోజకవర్గంలో భూకబ్జాలు పెరిగాయని, ప్రతి చెరువు, ప్రతి కుంట, ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఉన్నా ఆక్రమణకు గురయ్యాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి అన్నారు. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం టీటీడీ కల్యాణ మండపం ఎదుట రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మహబూబ్‌నగర్ అర్బన్ తోపాటు రూరల్ ఏరియాలో ఉన్న బఫర్ జోన్‌లలో ఉన్న స్థలాలను బీఆర్ఎస్ నాయకులు ప్లాట్స్ చేసి విక్రయిస్తున్నారని, పాలకొండలో ఉన్న ప్రభుత్వ స్థలంలోని చెరువులో ఏకంగా కాలనీలు నిర్మిస్తున్నారని వివరించారు. చిన్నవాగులతో పాటు కాల్వలు సైతం కబ్జాలు చేస్తున్నారని విమర్శించారు. పాతపాలమూరు, శివశక్తినగర్ కాలనీలు వర్షం వస్తే పూర్తిగా చెరువుగా మారిపోతున్నాయని ఇక్కడి నాయకుల కబ్జాలే ఇందుకు కారణమని పేర్కొన్నారు. పాలకొండలో ఉన్న 583, 79 సర్వే నెంబర్‌లలో ప్లాట్స్ చేసి విక్రయాలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఎవరైనా వెంచర్ చేయాలంటే కచ్చితంగా 20శాతం భూమి ఇస్తే తప్ప రియల్ ఏస్టేట్ చేసుకోలేని పరిస్థితి వచ్చిందని వాపోయారు. అనంతరం బీజేపీ నేత ఎన్పీ వెంకటేష్ మాట్లాడుతూ 9ఏళ్లుగా పాలమూరులో కబ్జాలు అధికంగా జరుగుతున్నాయని, ఇరిగేషన్, మైనింగ్, మున్సిపాలిటీ శాఖలు ఎందుకు స్పందించడం లేదన్నారు. పాండురంగారెడ్డి, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం వీరన్నపేటలోని హజ్రత్ జమీలుల్లాషా ఖాద్రీ రిఫాయి దర్గా గంధోత్సవం బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా పీఠాధిపతి మతీన్ అహ్మద్ ఖాద్రీ రిఫాయి నివాసం నుంచి గంధాన్ని దర్గా వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం దర్గాలో గంధాన్ని సమర్పించి ప్రత్యేక ఫాతేహా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీలోని సత్యసాయి జిల్లా పెనుకొండ సదర్‌చౌక్ దర్గా పీఠాధిపతి సయ్యద్ సఫీరుల్లాషా హాజరయ్యారు. కార్యక్రమంలో మత పెద్దలు ఫైజుల్లా ఖాద్రీ, ముబీన్ అహ్మద్, సాదుల్లా, జమీర్ ఖాద్రీ, గియాసుద్దీన్ షర్ఫీ తదితరులు పాల్గొన్నారు.

12న కలెక్టరేట్ వద్ద ధర్నా

జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వద్ద 12న నిర్వహించే ధర్నాను విజయవంతం చేద్దామని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ శంకర్‌యాదవ్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా ముఖ్యుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెయ్యి మంది దివ్యాంగులతో ధర్నా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. అవసరమైతే ఎమ్మార్పీఎస్ సహకారం తీసుకుందామన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్యనాయకులు సుంకసారి చెన్నకేశవులు, నరేందర్, జైపాల్, కృష్ణకుమార్, ఫకీరయ్య, రఫీక్, బిచ్యానాయక్‌తో పాటు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ జంగయ్య మాదిగ, సీనియర్ నాయకులు కావలి కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు.



ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



హన్వాడ: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు సంచాలకుడు గాజర్ల రమేష్ పేర్కొన్నారు. బడిబాటలో భాగంగా బుధవారం ఆయన జిల్లా విద్యాధికారి రవీందర్‌తో కలిసి చిన్నదర్పల్లి, బుద్దారం గ్రామాల్లో పర్యటించారు. బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలకు పంపించి బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సమన్వయకర్తలు బైకని బాలుయాదవ్, దుంకుడు శ్రీను, మండల విద్యాధికారి రాజు నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్, సర్పంచ్ చెన్నయ్య పాల్గొన్నారు.

కేజీబీవీ ఎస్ఓగా కవిత

మిడ్జిల్: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారిణిగా కవిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఓగా విధులు నిర్వహిస్తున్న స్వరూపారాణి అమరచింతకు బదిలీ కాగా, అక్కడ విధులు నిర్వహిస్తున్న కవిత ఇక్కడికీ వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామన్నారు. సిబ్బంది సహకారంతో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

9 నుంచి ఉర్సు ఉత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: కర్ణాటక రాష్ట్రం హల్‌కట్టా షరీఫ్‌లోని హజ్రతే సయిదా హఫీజా బీబీ, హజ్రత్ ఖాజా సయ్యద్ ఇబ్రాహీంషా ఖాద్రీ రహెమతుల్లా అలై దర్గా ఉత్సవాలు ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని హఫీజ్ మహ్మద్ ఉస్మాన్ ఖాద్రీ ఖదిరి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హల్‌కట్టా షరీఫ్ దర్గా పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ అబు తురాబ్‌షా ఖాద్రీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. 9న అసర్ నమాజ్ అనంతరం ఖత్మే ఖురాన్ ఉంటుందని తెలిపారు. అదే రోజు రాత్రి 9 గంటలకు ధార్మిక సభ ఉంటుందని పేర్కొన్నారు. 10న ఫజర్ నమాజ్ అనంతరం తెల్లవారుజామున గంధోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

కులవృత్తుల వారికి రూ.లక్ష

- 9న లాంఛనంగా ప్రారంభం


మట్లాడుతున్న కలెక్టర్ రవి నాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : బీసీ కులవృత్తులు, చేతివృత్తుల వారికి ప్రభుత్వం అందించనున్న రూ.లక్ష సాయాన్ని 9న సంక్షేమ సంబురాల సందర్భంగా లాంఛనంగా ప్రారంభించాలని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంత్రి హరీష్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారీ, రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులు, జిల్లా కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీసీలో ఆయన మాట్లాడారు. సంక్షేమ సంబురాల సందర్భంగా రెండవ విడత గొర్రెల పంపిణీ, అవకాశం ఉన్న చోట ఇంటి పట్టాల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ జి. రవి నాయక్ మాట్లాడుతూ గురువారం ఊరూరా చెరువుల పండుగ ఉంటుందన్నారు. సందర్భంగా ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారు బుధవారం సాయంత్రమే చెరువులను సందర్శించాలని ఆదేశించారు. అదేవిధంగా సంక్షేమ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారుల గుర్తింపు, పంపిణీని ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా చేపట్టాలని అన్నారు. అదేరోజు గొర్రెల పంపిణీకి చర్యలు తీసుకోవాలని జిల్లాలో మూడు నియోజకవర్గాలలో 36 యూనిట్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. 14న నిర్వహించనున్న తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమానికి లబ్ధిదారులను పిలవాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామరావు, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి టైటాస్ పాల్, డీఆర్‌డీఓ యాదయ్య ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి కల్పిస్తాం


కలెక్టర్, ఎస్పీలతో కలిసి కేటీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా మహిళలకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సెయింట్ ఫౌండేషన్, శాంతా నారాయణ గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మెట్టుగడ్డ లో ఉన్న బాలికల ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ గురువారం భూమి పూజ చేస్తారని తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం, జిల్లా కేంద్రంలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో కళాశాల వద్ద మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ రవి నాయక్, ఎస్పీ కె. నరసింహ, ఇతర అధికారులతో ఏర్పాట్లను పరిశీలించారు. మహిళలకు ఉపాధి కల్పించాలని ఆలోచన చేసిన సెయింట్ ఫౌండేషన్ నిర్వాహకురాలు ప్రతిన్య, శాంతా నారాయణ గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ శ్రీహితలను మంత్రి అభినందించారు. యువజన సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో ఇప్పటికే 45 కోర్సుల్లో యువతకు శిక్షణ అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామని న్యాక్ ఆధ్వర్యంలోనూ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసి యువతకు అండగా నిలిచామన్నారు. అడిషనల్ కలెక్టర్ కె. సీతారామారావు, సెయింట్ ఫౌండేషన్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఇన్‌చార్జ్ కృష్ణ దీవి, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్, కమిషనర్ ప్రదీప్ కుమార్, డీఎస్పీ మహేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

చెరువుల పండుగకు సర్వంసిద్ధం


పాలకొండ చెరువు వద్ద శుభ్రం చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ‘ఊరూరా చెరువుల పండుగ’ నిర్వహించనున్నారు. వార్డు నం.9 పరిధిలోని పాలకొండ చెరువు మినీట్యాంక్‌బండ్‌ను ఎంపిక చేశారు. దీంతో రెండు మూడు రోజులుగా మున్సిపల్ అధికారులు ఆ పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగించారు. ఎలాంటి అపరిశుభ్రత లేకుండా తగు చర్యలు తీసుకున్నారు. మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా రానున్నారు. రాత్రి వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో బతుకమ్మ ఆటలు, కోలాటం, చెరువుపై పాటలు, బోనాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

దేవరకద్ర: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం నిర్వహించే చెరువుల పండుగకు పంచాయతీ అధికారులు, నీటీ పారుదల శాఖ, మత్స్యకారులు, ప్రజా ప్రతినిధులు భారీ ఎత్తున ఏర్పాట్లను చేశారు. దేవరకద్రలోని పెద్ద చెరువు పండుగకు సిద్ధమైంది. సాయంత్రం దేవరకద్ర పోచమ్మ ఆలయం నుంచి చెరువు వరకు ఊరేగింపు, కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

నవాబుపేట: గ్రామగ్రామాన గురువారం నిర్వహించే చెరువుల పండగలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, రైతుబంధు చైర్మన్ మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అదే విధంగా జడ్చర్ల కేంద్రంలో గురువారం జరిగే కేటీఆర్ బహిరంగ సభకు మండలం నుంచి 30 ప్రత్యేక బస్సుల్లో కార్యకర్తలు, ప్రజలు తరలుతున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు.


దేవరకద్ర పెద్ద చెరువు వద్ద ..

చిన్నచింతకుంట: చెరువుల పండగ కార్యక్రమానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఉమ్మడి మండలంలోని అప్పంపల్లి పంచాయతి కార్యదర్శి మమత కోరారు. గ్రామ చెరువులో పండగ ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, కూలీలు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా!


పెద్దగా నిర్మించాల్సిన వెంకటేశ్వర కాలనీ మురుగుకాల్వ ఇదే..

- ముంపు ప్రాంతాలకు తప్పని ఎదురుచూపులు
- వర్షాకాలం ప్రారంభం అవుతుండడంతో ఆందోళన చెందుతున్న కాలనీల ప్రజలు

జడ్చర్ల టౌన్: వర్షాకాలం ప్రారంభం అవుతుండటంతో సమస్య పరిష్కారం కోసం స్థానిక వెంకటేశ్వర కాలనీ వాసులు వేచి చూస్తున్నారు. మున్సిపాలిటీ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు దాటినా ప్రధాన సమస్యల్లో ఒకటైన వరద ముంపు నియంత్రణలో విఫలమవుతూనే ఉన్నారని అంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రధానంగా వరదల సమయంలో వెంకటేశ్వర కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. నీళ్లలన్నీ ఇళ్లలోకి చేరుతాయి. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కుమ్మరికుంట ఆక్రమణల వల్లే..

లక్ష్మీనగర్ కాలనీ–వెంకటేశ్వరకాలనీ మధ్య ఉన్న కుమ్మరి కుంట రియల్ మాఫియా వల్ల ఆక్రమణలకు గురైంది. కుంటను తొలగించటంతోపాటు కట్టనూ తీసివేశారు. దీంతో వరదనీరు నేరుగా వెంకటేశ్వర కాలనీలోకి ప్రవహిస్తుంది.

2007–08లో వచ్చిన వరదల వల్ల వెంకటేశ్వర కాలనీ అతలాకుతలం అయ్యింది. కుమ్మరికుంట ఆక్రమణలకు గురికావటంతో వరదనీరు నిల్వ ఉండేందుకు అవకాశం లేకపోవటంతో కాలనీని వరద నీరు ముంచెత్తింది. ఆ సమయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం వేసిన మెటీరియల్ సిమెంట్, ఇసుక వరదనీటిలో కొట్టుకుపోగా స్టీల్ నీటమునిగి పాడయ్యింది. వరదలతో ఇబ్బందులు పడుతున్న కాలనీని సందర్శించిన అప్పటి జిల్లా కలెక్టర్ ఉషారాణి కుమ్మరికుంట ఆక్రమణ వల్లే పరిస్థితి ఏర్పడిందని గుర్తించారు. యుద్ధప్రాతిపదికన కుమ్మరికుంట కట్టను నిర్మింపజేశారు. దానివల్లే ఇప్పటివరకు కాలనీకి రక్షణ ఏర్పడింది. అయితే వరదలు పెరగటం, మురికినీటీ ప్రవాహం అధికం కావటంతో మళ్లీ వెంకటేశ్వర కాలనీకి ప్రమాదం తప్పదని ప్రజలు అంటున్నారు. అయితే ప్రస్తుతం కాలనీలో ఉన్న కాల్వను తొలగించి దానిస్థానంలో పెద్ద కాల్వను నిర్మిస్తే ఇబ్బందులు తీరుతాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. లక్ష్మీనగర్ కాలనీలో మొదలుపెట్టి వెంకటేశ్వరాలనీ మీదుగా 167వ నెంబరు జాతీయ రహదారి నుంచి ఎంబీ చర్చ్ పక్క నుంచి మొత్తం 700మీటర్ల మేర నిర్మాణం చేపడితే ఇబ్బందులు తొలిగే అవకాశం ఉందటున్నారు. కాగా ఈ మేరకు కాల్వ నిర్మించడానికి రూ.1నుంచి రూ.2కోట్లు అవసరం అవుతాయని అంచనా.

కాల్వ నిర్మిస్తేనే రక్షణ

వరదలు రావటం, ఉన్న మురికి కాల్వ ఉప్పొంగి ఇళ్లల్లోకి నీళ్లు చేరడం పరిపాటి గా మారడంతో కాలనీ ప్రజలకు సమస్యలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఉన్న కాల్వ తొలగించి మొత్తం 700మీ. మేర పెద్ద కాల్వ నిర్మిస్తేనే వెంకటేశ్వర కాలనీ సురక్షితంగా ఉండడానికి అవకాశం ఉంది. విషయాన్ని పాలకమండలి దృష్టికి తీసుకువెళ్లాం. రాబోయే టీఎస్‌యూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా నిర్మాణం చేపట్టేందుకు హామీ ఇచ్చారు.

–ఆలూరి శశికిరణ్,
26వ వార్డు కౌన్సిలర్

త్వరలోనే పరిష్కరిస్తాం

రాబోయే నిధుల ద్వారా లక్ష్మీనగర్ కాలనీ–వెంకటేశ్వర కాలనీల్లో పెద్ద కాల్వ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. టీఎస్‌యూఎఫ్ఐడీసీ నిధుల్లో మొదటి ప్రాధాన్యత పట్టణంలో ఉన్న ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకే ఇస్తాం. ఆ దిశగా కేటాయింపులు చేస్తున్నాం. 25–26 వార్డుల్లో పెద్ద కాల్వ నిర్మాణం చేపట్టి వెంకటేశ్వరకాలనీ వాసుల సమస్య పరిష్కరిస్తాం.

–దోరేపల్లి లక్ష్మి,
చైర్‌పర్సన్, జడ్చర్ల మున్సిపాలిటీ